క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూహనుమాన్ టెంపుల్, భవానీనగర్, ద్వారకాపురి, ప్రతాప్ నగర్, భాష్యం స్కూల్, మనోరమ ఐటీఐ, విద్యుత్‌నగర్, కుమారస్వామి టెంపుల్, పంచఫార్మా ఎస్‌ఐ, అడ్డగుట్ట, వాంబే కాలనీ, భవానీ మాతా టెంపుల్, పోచమ్మ టెంపుల్, ద్వారకా నివాస్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ వివరించారు.

చదువుకు పేదరికం అడ్డు కారాదు

పహాడీషరీఫ్: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు రావాలని మీ నేస్తం ఫౌండేషన్ ప్రతినిధులు అన్నారు. మీ నేస్తం ఫౌండేషన్ ఏర్పాటు చేసుకున్న రాయదుర్గం ప్రభుత్వ పాఠశాల 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం మామిడిపల్లి రంగనాయకుల కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, ఇతర స్టేషనరీ సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డు కారాదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారు ఉన్నత స్థానాలలో ఉన్నారని గుర్తు చేశారు. తమ వంతుగా పేద విద్యార్థుల సాయం కోసం ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు లాల్ సతీష్ గౌడ్, వి.రాజు గౌడ్, రాజు రెడ్డి, గణేష్, ప్రవీణ్, సంగీత, ఉదయ శ్రీ, భాగ్యరేఖ, పావనీ, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే సమస్యల పరిష్కారం

బడంగ్‌పేట్: బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు, సమస్యలు తీరుతాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జన్ సంపర్క్ అభియాన్ గడపగడపకూ పాదయాత్ర శుక్రవారంతో 9వ రోజుకు చేరుకుంది. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలోని వినాయక హిల్స్ కాలనీ ఫేస్–3లో ఇంటింటికి పాదయాత్ర సాగింది. కాలనీల్లో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఇంద్రసేనారెడ్డి పాదయాత్రలో పాల్గొని మద్దతు తెలిపారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు మాధురి, రమాదేవి, ఇంద్రసేనా, శ్రీధర్‌రెడ్డి, పద్మ, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, శూరకర్ణారెడ్డి పాల్గొన్నారు.

కాలనీలోకి మురుగు రాకుండా చూడాలి

హుడాకాంప్లెక్స్: వాసవి బిల్డర్స్ నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్ స్థలాల నుంచి వస్తున్న వ్యర్థాలతో కూడిన మురుగునీరు తమ కాలనీ మీదుగా రాకుండా చర్యలు తీసుకోవాలని శంకర్‌నగర్ వాసులు సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ హరికృష్ణయ్యకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పారుపల్లి దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ ఏర్పడి సుమారు 30 సంవత్సరాలు దాటిందని బస్తీ వెనకాల గతంలో సిరీస్ కంపెనీ నడిచేదని, దానివల్ల వెలువడుతున్న వ్యర్థాల వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో కాలుష్యం వల్ల కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. 20 సంవత్సరాల క్రితం కంపెనీ మూసివేయడంతో ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు వాసవి కన్‌స్ట్రక్షన్స్ వారు అపార్ట్‌మెంట్లను నిర్మాణంతో మరలా సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వివరించారు.

మురుగు సమస్య పరిష్కరించండి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో నెలకొన్న మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ శ్రీవాణి శుక్రవారం జలమండలి జనరల్ మేనేజర్ బలరామరాజుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాల నుంచి సరూర్‌నగర్ డివిజన్ మొత్తం ప్రజలతో కలిసి స్థానిక సమస్యల గురించి చర్చించానని, ముఖ్యంగా డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను అరికట్టడానికి నాలుగు కేటగిరిలో విభజించడం జరిగిందన్నారు. రెండు రోజులకోసారి నిండే డ్రైనేజీ సమస్యపై స్థానిక ప్రజలు, సంబంధిత అధికారులతో చర్చించిన తర్వాత వీటికి కారణాలు కనుక్కోవడం జరిగిందని అన్నారు. మ్యాన్‌హోల్ ఛాంబర్ రిపేరు, గ్రావిటి ఇష్యూస్, పైపులైన్ లెవెల్స్ కలవకపోవడం, పైపులైన్ డ్యామేజ్, స్మాల్ డయా పైపులైన్, వీటితో పాటుగా కొన్ని తప్పిదాల వల్ల డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతోందని అన్నారు. ప్రత్యేక నిధులు మంజూరు చేసి మురుగు సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

వంటింట్లో కూరగాయల మంట!

- రైతుబజార్లలోనూ ఆకాశాన్నంటుతున్న ధరలు
- బహిరంగ మార్కెట్‌లో మరింత ప్రియం
- కొనలేక అల్లాడుతున్న ప్రజలు


వనస్థలిపురం రైతుబజార్

వనస్థలిపురం: అంతకంతకు పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజల గుండెల్లో ఆందోళన పుట్టిస్తున్నాయి. కూరగాయల ధరలు అర సెంచరీ, సెంచరీ దాటుతూ వంటింట్లో మంట పుట్టిస్తున్నాయి. నింగినంటుతున్న ధరలతో కూరగాయలు కొనలేక సామాన్య, మధ్య తరగతి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. గతంలో రూ. 200 పెడితే వారం రోజులకు సరిపడా కూరగాయలు వచ్చేవని, నేడు రూ. 500 పెట్టినా వారం సరిపడా రావడం లేదని వారు వాపోతున్నారు. నాన్‌వెజ్‌లకు దీటుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయని, ఇక కూరలు వండుకునేది ఎట్లా.. తినేది ఎట్లా అని వారు దిగాలు పడుతున్నారు.

◆ ప్రస్తుతం రైతుబజార్‌లో ఒకటి, రెండు రకాలు తప్ప అన్ని రకాల కూరగాయల ధరలు రూ. 50కి పైగా, మరికొన్ని సెంచరీకి చేరువ కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గతంలో రూ. 20, 30 పెడితే కిలో వచ్చే కూరగాయలు ఇపుడు రూ. 50 నుంచి 100 ధరల్లో లభ్యం అవుతున్నాయి. ఇంతకుముందు కిలో కొన్నచోట ప్రస్తుతం పావుకిలో, అరకిలో కొని సరిపెట్టుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

కూరగాయల ధరలు ఇలా...

వనస్థలిపురం రైతుబజార్‌లో శుక్రవారం వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాటా కిలో రూ. 91, వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి 95, కాకర 45, బీర 40, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 17, క్యారెట్ 45, దొండ 28, ఆలు 21, ఉల్లి 18, గోకర 35, దోస 17, సొర 15, పొట్ల 23, అరటి 10, చిక్కుడు 85, అర్వి 35, మునగ 45, చిలగడదుంప 28, బీట్‌రూట్ 28, కీర 28, ఫ్రెంచ్ బీన్స్ 95, క్యాప్సికమ్ 65 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి. ఇదిలా ఉండగా ఆకుకూరలు సైతం గతంలో రూ. 10కి 5, 6 కట్టలు వచ్చేది ఉండగా ప్రస్తుతం రూ. 20 పెట్టి నాలుగు కట్టలు కొనాల్సి వస్తోంది. కొత్తిమీర, పూదీన రూ. 20కి రెండు కట్టలు మాత్రమే వస్తున్నాయి.

◆ రైతుబజార్‌లో ఈ ధరలు ఉండగా ఇక బహిరంగ మార్కెట్లలో పరిస్థితి కిలోకు రూ. 20 నుంచి 30 అదనంగా ఉందని వినియోగదారులు వాపోతున్నారు. టమాట, పచ్చిమిర్చి, బీన్స్ తదితర కూరగాయలను రూ. 100 ధరల్లో అమ్ముతున్నారని, కిలో కొనేచోట అరకిలో, పావుకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి తగ్గినందునే...



అధిక ఎండలతో పంట దిగుబడి తగ్గింది. గతంలో వనస్థలిపురం రైతుబజార్‌కు రోజు 600 క్వింటాళ్ల వరకు కూరగాయలు వస్తుండగా ప్రస్తుతం 400 క్వింటాళ్లకు మించి రావడం లేదు. మరో రెండు నెలల వరకు ఈ ధరలే కొనసాగవచ్చు. వర్షాలు కురిసి ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొత్త పంట వస్తే అప్పుడు ధరలు తగ్గే అవకాశం ఉంది.

– ఈవో స్వప్న, రైతుబజార్, వనస్థలిపురం

కొనేట్టు లేదు...

కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గతంలో రూ. 200 పెడితే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. నేడు రూ. 500 నుంచి 600 పెడితే తప్ప వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. దీంతో కూరగాయలు కిలో కొనే చోట అర కిలో, పావు కిలో కొని సరిపెట్టుకోవాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్లో ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. – నిర్మల, వనస్థలిపురం

రేపటి నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు


దిల్‌సుఖ్‌నగర్ ఆలయ సాయిబాబా

చైతన్యపురి: దక్షిణ షిరిడీగా ప్రసిద్ధి చెందిన దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు మూడు రోజుల పాటు గురుపౌర్ణమి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గుండ మల్లయ్య తెలిపారు. ట్రస్ట్ కమిటీ సభ్యులతో కలిసి శుక్రవారం ఆలయంలో ఉత్సవానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన ఉత్సవ వివరాలు వెల్లడించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయించటం జరిగిందన్నారు. వేలాది మంది భక్తులు బాబా దర్శనానికి వస్తుండటంతో పోలీస్ బందోబస్తు, ఆలయానికి వచ్చే భక్తుల కోసం పుల్లారెడ్డి స్కూల్ ఆవరణలో ప్రత్యేక పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రత్యేక వలంటీర్లు, సాయి సేవకులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తారని అన్నారు. సమావేశంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీదుర్గ, ఆర్థిక కార్యదర్శి ఆర్ఎస్ శంకరరావు, ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రేపు గురుపూజోత్సవం

వనస్థలిపురం: వేదభూమి సంస్థ ఆధ్వర్యంలో గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు వనస్థలిపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆచార్యులు, కవి, పండితులు, చారిత్రక నవలా చక్రవర్తి డా.ముదిగొండ శివప్రసాద్‌ను సత్కరించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి వేదభూమి సంస్థ ప్రతినిధులు, కవులు, కళాకారులు అందరూ హాజరు కావాలని వారు కోరారు.

గౌతమి విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న చెన్నోజు శ్రీనివాసులు

హస్తినాపురం: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న హస్తినాపురంలోని గౌతమి విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్యా నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావుకు శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. హస్తినాపురంలోని గౌతమి మోడల్ స్కూలుతోపాటు సరూర్‌నగర్ మండల పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థలలో విద్యార్థులను ఇరుకుగదుల్లో పెట్టి విద్యాబోధన చేస్తున్నారని మండల విద్యాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని చెన్నోజు శ్రీనివాసులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. సరూర్‌నగర్ మండల పరిధిలోని చాలా ప్రాంతాల్లో ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు కనీస వసతులు లేకపోయినా వాటిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని డీఈఓకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంకటేశ్, విష్ణు, రవినాయక్, లింగస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ప్లేగ్రౌండ్ కోసం కేటాయించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్: సింగరేణి కాలనీలోని ప్రభుత్వ పాఠశాలకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని క్రీడా మైదానం కోసం కేటాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండల కన్వీనర్ షేక్ మహమూద్ రెవిన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు వేదిక ప్రతినిధులతో కలిసి ఆయన శుక్రవారం సైదాబాద్ మండల తహసీల్దార్ వేణుగోపాల్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆటస్థలం లేక ఆరుబయట ఆడుకుంటున్నారని తెలిపారు. పాఠశాలకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ప్లేగ్రౌండ్‌గా అభివృద్ధి పరిస్తే చిన్నారులు నిత్యం అక్కడ ఆటలాడుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. తమ వినతికి తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు శంకర్‌నాయక్, అలివేలు, సంతోష, మహ్మద్ పాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి


హుడాభారతి కాలనీలో పర్యటిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఒక వైపు ప్రజలకు వివరిస్తూనే మరో వైపు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలలో ప్రచారం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని హుడాభారతి కాలనీలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్‌తో కలిసి మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని రంగారెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాధవరెడ్డి, జీవన్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, అరుణసింగ్, శిరీష, శేఖర్‌గౌడ్, రాజవర్ధన్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

సంప్రదాయ పరిరక్షణకు పూనుకోవడం అభినందనీయం

త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి


ఉభయవేదాంత పండిత సభలో త్రిదండి రామానుజ జీయర్‌స్వామి

మన్సూరాబాద్: సంప్రదాయ పరిరక్షణకు ఉభయ వేదాంత పండిత సభలను ఏర్పాటు చేయటం అభినందనీయమని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పేర్కొన్నారు. శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ, ఎస్వీఎస్ ట్రస్ట్, సత్సంప్రదాయ పరిరక్షణసభ ట్రస్ట్, ఉభయవేదాంత పండిత పరిషత్ సంయుక్త నిర్వహణలో ఎల్‌బీనగర్ చంద్రపురికాలనీలోని శ్రీవైష్ణవ సదనంలో శుక్రవారం ఉభయవేదాంత పండిత సభలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సభలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు మహనీయుల స్మరణలతో ఉభయ వేదాంత పండిత సభలను నిర్వహించుకోవటం సంతోషకరమన్నారు. మహనీయులు అందించిన గ్రంథాల సారాన్ని భవిష్యత్‌తరాలకు అందించటానికి ఉభయవేదాంత సభలు తోడ్పడుతాయని తెలిపారు. డాక్టర్ కందాడై రామానుజాచార్యస్వామి మంగళాశాసనము చేయగా సేనాపతిమోహన్ స్వాగతవచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సముద్రాల శఠకోపాచార్యస్వామి, డాక్టర్ టీకే. చూడామణి, చించాపట్టణం జగన్మోహనచార్యులు, తిరువరంగం దాసశేషు, శ్రీవైష్ణవ సంఘం, తెలంగాణ అధ్యక్షుడు ఎస్టీచారి, ఎస్వీఎస్ ట్రస్ట్ చైర్మన్ యాదగిరిచార్యులు, కార్యదర్శి లక్ష్మీనాథచార్యులు, యోదుమోహన్, బద్రీనాథ్ పాల్గొన్నారు.

మంత్రి సబితపై ఆరోపణలు హాస్యాస్పదం


సమావేశంలో మాట్లాడుతున్న కామేష్‌రెడ్డి

మీర్‌పేట: ప్రజాదరణ లేని వారు మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని మీర్‌పేట కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పార్టీ మారిన కొత్త మనోహర్‌రెడ్డి అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేషన్ ఎన్నికల్లో సొంత తమ్ముడిని గెలిపించుకోలేని మనోహర్‌రెడ్డి కోట్లాది రూపాయలతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. మనోహర్‌రెడ్డి తీరు మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు లావణ్య, రాంచందర్, రవినాయక్, అరుణ, రాజేందర్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, యాదగిరి ముదిరాజ్, సుదర్శన్, శేఖర్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

న్యాయవాదుల సాంస్కృతిక సమ్మేళనం

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో శనివారం నాగోల్ శుభమ్ కన్వెన్షన్‌లో న్యాయవాదుల వార్షిక సంస్కృతిక సమ్మేళనం నిర్వహించనున్నట్టు సంఘం ఉపాధ్యక్షురాలు సునీత బర్ల తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సంఘం ఏర్పాటు తరువాత ఇది 12వ వార్షిక సాంస్కృతిక కార్యక్రమంగా వారు పేర్కొంటూ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు సంఘం సంచాలకులు డా. బాచిరెడ్డి శాయిరెడ్డి, కె యాదగిరిరావు తెలిపారు.


ఐఎస్‌సదన్‌కు రూ. 35 లక్షల బోనాల నిధులు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్‌కు రూ. 35 లక్షల బోనాల నిధులు మంజూరు అయ్యాయని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఐఎస్ సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని అమ్మవారి దేవాలయాల అభివృద్ధికి నిధులు వినియోగిస్తామన్నారు. ఆలయాల వద్ద రహదారులపై ఏర్పడిన గుంతల మూసివేత, ఆలయాల వద్ద వీధి దీపాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పించి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేసి బోనాల మహోత్సవాలకు సిద్ధం చేస్తామని ఆమె వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మలక్‌పేట: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ సమాచారం మేరకు... మూసారంబాగ్ మూసీనదిలో శుక్రవారం ఉదయం సుమారు 40 సంవత్సరాల వయసు ఉన్న ఓ వ్యక్తి మృతదేహం నది ప్రవాహంలో కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి తరలించారు. మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేవని, మూసీలోకి జారిపడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మెరూన్ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు, బనియన్ ధరించి ఉన్నాడు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: విద్యుత్ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం సరూర్‌నగర్ ఎలక్ట్రికల్ డీఈకి వినతిపత్రం సమర్పించారు. కొన్ని కాలనీల్లో నూతన కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని, పాత కాలంనాటి లైన్లు లూజ్ కనెక్షన్‌లు ఉండటం, చెట్లు భవనాల మధ్య ఉండటం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని వివరించారు. నూతన విద్యుత్ స్తంభాలు అవసరమైన ప్రాంతాల్లో వేయాలని కోరారు. వీటినంత త్వరగా పనులు చేపట్టి డివిజన్‌లో విద్యుత్ సమస్యలు లేకుండా చేయాలని కార్పొరేటర్ కోరారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను డీఈ దామోదర్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ప్రజలకు అతిత్వరలోనే మంచినీటి పైపులైన్‌తోపాటు డ్రైనేజీ సమస్యను కూడా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహేశ్, బాలనర్సింహ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

అంబర్‌పేట: ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట ప్రధాన రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల బస్టాప్ వెనుకాల ఉన్న ఖాళీ ప్రదేశంలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో స్థలానికి చేరుకున్న పోలీసులు సదరు వ్యక్తిని పరిశీలించగా.. దుండగులు బండరాయితో మోదీ చంపినట్లు గుర్తించారు. విచారణలో హత్యకు గురైన వ్యక్తి అంబర్‌పేట బాపూనగర్‌కు చెందిన మహ్మద్‌వాహేద్ కుమారుడు జాకీర్ హుస్సేన్ (40)గా గుర్తించామన్నారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు సంతానం. కాగా.. ఆటో నడుపుతుండేవాడని పాతకక్షలతోనే హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కాలనీలు, బస్తీల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆమె అధికారులతో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... ఫుట్‌పాత్‌లపై పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలు, వ్యర్థాలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. చెత్త క్రమంగా ఎప్పటికప్పుడూ తొలగించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా పారిశుద్ధ్య నిర్వాహణ ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఏఈ రవికాంత్, శానిటేషన్ జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఏలు ముజీబ్, శ్రీను, గణేష్, అక్షయ్, నాయకులు దినేష్, నవీన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ


ఇంటింటికీ బీజేపీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలో ప్రచారం చేసి కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రావు, శరత్‌కుమార్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, మహేందర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, రవిశంకర్, కామేశ్, సుధీర్, రాజు పాల్గొన్నారు.